ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్ కార్యకలాపాలు

**ANDHRA PRADESH**
**LEGISLATIVE COUNCIL DEBATES**

అధికార నివేదిక

# OFFICIAL REPORT

మంగళ వారం, ఫిబ్రవరి 16, 2010
పదకొండవ సమావేశము, సంపుటము I, నంబరు. 1
విరోధినామ సంవత్సర పాల్గుణ శు.2

**TUESDAY, THE 16TH FEBRUARY, 2010**

**ELEVENTH SESSION, VOLUME I, NO.1**

**27 MAGH, 1931 S.E.**

* * * * *

శాసన పరిషత్తు సచివాలయము,
పబ్లిక్ గార్డెన్స్,
హైదరాబాద్ – 500 004.

**LEGISLATURE SECRETARIAT,**
**PUBLIC GARDENS,**
**HYDERABAD - 500 004.**

## ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్తు
## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| చైర్మన్ | : | డా. ఎ. చక్రపాణి |
| డెప్యూటీ చైర్మన్ | : | శ్రీ మహ్మద్ జానీ |
| ఉపాధ్యక్షుల పేర్ల పట్టిక | : | శ్రీ గిడుగు రుద్రరాజు<br>శ్రీ ఎస్. జగదీశ్వర్ రెడ్డి<br>శ్రీ ఐలాపురం వెంకయ్య<br>శ్రీ చుక్కా రామయ్య |
| కార్యదర్శి | : | డా. ఎస్. రాజ సదారామ్ |
| సంయుక్త కార్యదర్శులు | : | శ్రీ డి. శివరావు<br>శ్రీ ఎం.వి.వి. సత్యానందం |
| ఉప కార్యదర్శులు | : | శ్రీ డి. నర్సింహులు<br>శ్రీ పి. సత్యనారాయణ<br>శ్రీ కె. సుభాష్ చంద్రబోస్<br>శ్రీ ఎ. రాంరెడ్డి<br>శ్రీమతి వి. గిరిజాసుందరి |
| సహాయ కార్యదర్శులు | : | శ్రీ ఎస్. జయరాం<br>శ్రీ కె. సత్యనారాయణరావు<br>శ్రీ మహ్మద్ జహీరుద్దీన్<br>శ్రీమతి ఎ. సత్య సాయి లక్ష్మి<br>శ్రీ జి. వెంకట కృష్ణ<br>శ్రీ పి. బాలకృష్ణమాచార్యులు<br>శ్రీమతి వి. ప్రభ<br>శ్రీమతి వై. వెంకట రమణమ్మ<br>శ్రీ పి. రవీంద్రరెడ్డి<br>శ్రీమతి బి. నరసమ్మ<br>శ్రీమతి ఎ. బెనడిక్ట స్వామి<br>శ్రీమతి టి. సుశీల<br>శ్రీ ఎం.వి.యస్. బాపిరాజు |
| మార్షల్ | : | శ్రీ ఆర్. సీతారామారావు |
| చీఫ్ రిపోర్టర్ | : | శ్రీ సురారపు దుర్గాప్రసాద్ |

* * * * *

# ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్తు కార్యకలాపములు

## అధికార నివేదిక

**మంగళవారం, ఫిబ్రవరి 16, 2010**

**విషయ సూచిక**

1. సభా కార్యక్రమం ః

విషయం : శ్రీమతి ఎం. లక్ష్మీదేవి మరణం పట్ల సంతాప తీర్మానం.

* * * * *

ఆంధ్రప్రదేశ్ శాసనపరిషత్తు
**2010, ఫిబ్రవరి 16 వ తేది, మంగళవారం**
పదకొండవ సమావేశపు మొదటి రోజు

(సభ ఉదయం **10.00** గంటలకు ప్రారంభమైనది. గౌరవ ఛైర్మన్ అధ్యక్ష స్థానంలో ఉన్నారు.)

సభా కార్యక్రమం

సంతాప తీర్మానం

MR. CHAIRMAN: Now, I request the Hon'ble Chief Minister to move the Condolence Motion.

DR. K. ROSAIAH: Sir, I beg to move:

"That this House places on record its deep sense of sorrow at the demise of Smt. M. Lakshmi Devi, Member of Legislative Council and conveys its deep sense of sympathy to the members of bereaved family".

MR. CHAIRMAN: Motion moved.

డా. కె. రోశయ్య : అధ్యక్షా, మొట్టమొదట క్షమించమని కోరుతున్నాను. ఎందుకంటే ఈ తీర్మానాన్ని నేను తెలుగులో చెప్పి ఉండవలసింది. యాదృచ్ఛికంగా ఇంగ్లీషులో చెప్పడం జరిగింది. చిన్న పొరపాటు జరిగింది. ఏమైనా మొన్నటివరకు మనతోపాటు శ్రీమతి లక్ష్మీదేవిగారు శాసనమండలి సభ్యురాలుగా ఉన్నారు. ఆవిడ కల్యాణదుర్గం నుండి రెండుసార్లు శాసనసభకు ఎన్నికయ్యారు. మనరాష్ట్రంలో మంత్రిగా పనిచేశారు. మహిళా కాంగ్రెస్‌కు చాలా కాలం రాష్ట్ర నాయకురాలిగా, అఖిల భారతదేశంలో గుర్తింపు పొందిన నాయకురాలిగా పనిచేశారు. ఆవిడ తన జీవితాన్ని టీచరుగా ప్రారంభించి, రాజకీయాలలో కాలుపెట్టారు. రాజకీయాలలో అంచెలంచెలుగా పెరిగారు. కాంగ్రెస్‌పార్టీకి సంబంధించినంతవరకు సిడబ్ల్యుసి మెంబరు అంటే అత్యున్నతమైన పదవిగా భావిస్తారు. అటువంటి సిడబ్ల్యుసిలో లక్ష్మీదేవిగారు మెంబరుగా పనిచేశారు. దురదృష్టవశాత్తు ఆవిడ ఆరోగ్యం ఇటీవల కొంత ఇబ్బందికరంగా మారింది. కొంత కాలం ట్రీట్‌మెంట్ పొంది స్వస్థత చేకూరింది అని అందరం భావిస్తున్న తరుణంలో అకస్మాత్తుగా ఆవిడ మనకు దూరం కావడం జరిగింది. వారు మన మధ్య లేకపోవడం అనంతపురం జిల్లాకు మాత్రమే కాదు, ఈ రాష్ట్రానికి మరీ ముఖ్యంగా మహిళలందరికీ కూడా తీరని లోటు. ఆమె పేద, బడుగు బలహీన వర్గాల వారికోసం అసిధారావ్రతంగా పనిచేసినటువంటి నాయకురాలు. శ్రీమతి లక్ష్మీదేవిగారు మొట్టమొదటనుండి కూడా కాంగ్రెస్‌పార్టీకి అంకితమైన నాయకురాలు. నాకు మొదట ఆవిడ మంత్రిగా అయినటువంటి సందర్భం బాగా గుర్తుంది. నేను న్యూ ఎమ్ఎల్ఏ క్వార్టర్స్ లో ఉండేవాడిని. లక్ష్మీదేవిగారు మంత్రి అయ్యారని తెలిసినప్పుడు ఆవిడ సింగిల్ రూమ్ ఫ్లాట్‌లో ఉన్నారు. అంటే, ఆవిడ దేనికోసం ప్రయత్నం చేసేవారు కాదు. ఆవిడను వరించి పదవులు వచ్చాయి. అటువంటి మహిళా నాయకురాలిని కోల్పోవడం దురదృష్టకరం. ప్రభుత్వం తరపున సంపూర్ణమైనటువంటి సానుభూతిని తెలియచేస్తూ, సభ ఈ తీర్మానాన్ని ఆమోదించవలసిందిగా కోరుతున్నాను.

శ్రీ దాడి వీరభద్రరావు (విశాఖపట్నం) : అధ్యక్షా, ఇటీవలి కాలంవరకు శాసనమండలిలో మనతోపాటు సభ్యురాలిగా ఉన్నటువంటి సోదరి శ్రీమతి లక్ష్మీదేవిగారు మనలని విడిచి వెళ్లిపోవడమనేది సభ్యులందరూ విచారించవలసిన సందర్భం. 1989లో వారు శాసన సభ సభ్యురాలుగా, మంత్రిగా మాకు కూడా సుపరిచితులు. చాలా మంచి హృదయంతో అందరితో సన్నిహిత సంబంధాలు పెంచుకొని మంత్రి పదవి నిర్వహించిన వ్యక్తి. రెండు పర్యాయములు ఎమ్ఎల్ఏగా, రెండు పర్యాయములు ఎమ్ఎల్సీగా, రెండు పర్యాయములు మంత్రిగా పనిచేసి, విలువలకు ప్రాధాన్యం ఇచ్చిన వ్యక్తిగా ఆమె పేరు పొందారు. అదే విధంగా యూనివర్శిటీ సెనేట్ సిండికేట్ లో సభ్యురాలిగా పనిచేసి విద్యారంగానికి సేవచేసినటువంటి విషయం మరువలేనిది. ఆ కాలంలో ఎస్సీ కమ్యూనిటీ నుండి, మహిళలనుండి మొట్టమొదటిసారిగా గ్రాడ్యుయేషన్ పొందిన వ్యక్తిగా అనంతపురం జిల్లాలో ప్రాతినిధ్యం వహించినటువంటి వ్యక్తి ఆవిడ. వారు లేనటువంటి లోటు తీర్చలేనిది. శ్రీమతి లక్ష్మీదేవిగారి మృతి పట్ల వారి కుటుంబ సభ్యులకు తెలుగుదేశం పార్టీ తరఫున తీవ్ర సంతాపాన్ని , సానుభూతిని తెలియచేస్తున్నాము.

శ్రీ పువ్వాడ నాగేశ్వరరావు (అసెంబ్లీ) : అధ్యక్షా, శ్రీమతి లక్ష్మీదేవిగారు నిన్నటిదాకా మన సభలో సభ్యురాలుగా ఉండి మన అందరికి చిరపరిచితులైనటువంటి వ్యక్తి, గతంలో శాసనసభలో కూడా కళ్యాణదుర్గం నియోజకవర్గం నుండి ప్రాతినిధ్యం వహించారు. గతంలో రద్దు అయినటువంటి శాసన మండలిలో కూడా సభ్యురాలు ఆమె. రోశయ్యగారు అపోజిషన్ లీడరుగా ఉన్న కాలంలో, ఆ తరువాత వెంగళరావుగారి మంత్రివర్గంలో కూడా ఆమె సభ్యురాలిగా కొనసాగారు. శ్రీమతి లక్ష్మీదేవిగారు వెనకబడ్డ జిల్లా అయినటువంటి అనంతపురం జిల్లాకు ప్రాతినిధ్యం వహించారు. శ్రీమతి లక్ష్మీదేవిగారు ఆ రోజులలో మట్టిలో మాణిక్యంగా, అట్టడుగు వర్గాలకు సంబంధించిన వ్యక్తిగా కాంగ్రెస్ పార్టీలో అందరి మన్ననలను పొంది మంత్రివర్గంలో కూడా పనిచేశారు. అంతేకాకుండా కాంగ్రెస్ పార్టీలో అత్యున్నతమైనటువంటి విధాన నిర్ణాయక మండలి (సిడబ్ల్యుసి) మెంబరుగా కూడా ఎన్నిక కాబడ్డారు. వారి మరణానికి రోశయ్యగారు పెట్టినటువంటి తీర్మానాన్ని బలపరుస్తున్నాము. మీ ద్వారా వారి కుటుంబ సభ్యులకు బంధు మిత్రులందరికీ మా సంతాపాన్ని తెలియచేస్తున్నాము. ప్రస్తుతం ఉన్నటువంటి రాజకీయపరిస్థితులలో ఆవిడ మనమధ్య లేకపోవడం, అనారోగ్య కారణాలవల్ల చనిపోవడం దురదృష్టకరం. ఆమె సాన్నిహిత్యంలో ఎమ్ఎల్ఏ గా కొంత కాలం, ఎమ్ఎల్సీగా కొంత కాలం నేను పనిచేయడం జరిగింది. రద్దయిన శాసనమండలిలో సభ్యులుగా కూడా పనిచేశాము. ఆవిడ 1982 నుండి శాసనమండలిలో కొంత కాలం సభ్యత్వాన్ని పొంది ఉన్నారు. ఏ బాధ్యత ఇచ్చినా, వాటిని సక్రమంగా నిర్వర్తించి, అన్ని వర్గాల ప్రజలతో, అన్ని రాజకీయపార్టీలతో చక్కగా వ్యవహరించేవారు. సభ పునరుద్ధరణ జరిగిన తరువాత సీనియర్ సభ్యురాలిగా ఉండి ఆప్యాయంగా పలకరించే వ్యక్తి నేడు మన మధ్య లేకపోవడం చాలా బాధాకరంగా అనిపిస్తోంది. దీనిని నేను తీరని లోటుగా భావిస్తూ నా సంతాపాన్ని మరోసారి తెలియచేస్తున్నాను. సభ ఏకగ్రీవంగా ఈ సంతాప తీర్మానాన్ని పాస్ చేయవలసిందిగా తమద్వారా సభ్యులందరికీ మనవి చేస్తున్నాను.

ఉ. 10.10

శ్రీ చేరుపల్లి సీతారాములు (అసెంబ్లీ) : అధ్యక్షా, ఈ రోజు శ్రీమతి లక్ష్మీదేవిగారి సంతాప తీర్మానాన్ని గౌరవ ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టారు. లక్ష్మీదేవిగారి గురించి ఇప్పటికే మాట్లాడిన పెద్దలు చాలా విషయాలు చెప్పారు. శ్రీమతి లక్ష్మీదేవిగారు 74 సంవత్సరాల వయస్సులో అనారోగ్యం తోడు కావడంతో ఆమె మననుండి దూరం కావడం జరిగింది. ముఖ్యంగా పేదవర్గాలలో పుట్టి, ఈ స్థాయికి రావడం అంటే చాలా కష్టంతో కూడిన

పని. ఆ శక్తిసామర్ధ్యాలు ఉన్నాయి కాబట్టే రెండు సార్లు ఎం.ఎల్.ఎ గా, ఎం.ఎల్.సి.గా, మంత్రిగా, సి.డబ్ల్యుసి మెంబర్‌గా ఎన్నిక కావడం జరిగింది. ఏదయినా ఆమె లేని లోటు మన రాష్ట్రానికి తీరని నష్టం. కౌన్సిల్ మెంబర్‌గా ఉండి, నిరాడంబరంగా తన జీవితాన్ని కొనసాగించారు. ఆమెకు నిజమైన నివాళి అర్పించాలంటే, వారు జీవించినటువంటి మార్గంలో ప్రయాణం చేయవలసిన అవసరం ఉంది. నిరంతరం పేదలకోసం తపనపడే స్వభావం, నిరాడంబరమైన జీవితం, పేదలకు సేవ చేయాలనే కోరిక వారికి నిండుగా ఉండేవి. ఆ విధంగా వారి ఆశయాలకు అణుగుణంగా, కౌన్సిల్ యొక్క విలువలను ముందుకు తీసుకుపోయే విధంగా మనం వ్యవహరించడం ఆమెకు నిజమైన నివాళిగా నేను భావిస్తున్నాను. శ్రీమతి లక్ష్మీదేవిగారి మృతికి సంతాపాన్ని తెలియజేస్తూ, వారి కుటుంబానికి నా సానుభూతిని తెలియజేస్తున్నాను.

శ్రీ దాచూరి రామిరెడ్డి (ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు) : అధ్యక్షా, శ్రీమతి లక్ష్మీదేవి గారి మరణానికి సంతాపం తెలియజేస్తూ, ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని నేను పూర్తిగా బలపరుస్తున్నాను. రద్దయిన చివరి కౌన్సిలులో నేను సభ్యుడిగా, ఆమె సభ్యురాలిగా ఉన్నాము. ఈ సెషన్స్‌లో కూడా ఆమె సభ్యురాలిగా ఉన్నటువంటి కాలంలో మనము గుర్తుపెట్టుకోవలసింది ఉపాధి హామీ పథకం, వారి నియోజక వర్గంలో సక్రమంగా అమలుజరగడం లేదని, పేదలకు ఉపయోగపడడం లేదని గట్టిగా మాట్లాడి మన డిపార్టుమెంట్ ద్వారా ఎంక్వయిరీ చేయించి, వారికి న్యాయం చేసిన సంఘటన నాకు బాగా గుర్తుంది. అలాగే మేము చాలా కమిటీలలో ప్రయాణం చేసేటప్పుడు ఆమె అనారోగ్యంగా ఉండికూడా చిత్తశుద్ధితో, సకాలంలో టైం మెయిన్‌టెయిన్ చేస్తూ సమావేశాలకు వచ్చే వారు. చివరగా ఒక కమిటీకి మాత్రమే రాలేకపోయినప్పుడు, ఆమె భర్త ఆమెకు ఆరోగ్యం బాగుండడం లేదని చెప్పారు. లక్ష్మీదేవిగారు మంత్రిగా ఉన్నప్పుడు ఉపాధ్యాయ సమస్యలు, మొదలైన వాటిని ఆమె ముందుకు తీసుకువెళ్ళినప్పుడు సానుభూతితో స్పందించిన సంఘటనలు గుర్తుకు వస్తున్నాయి. శ్రీమతి లక్ష్మీదేవి మరణానికి సానుభూతిని తెలియజేస్తున్నాను. అంతేకాక వారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, పి.డి.ఎఫ్. గ్రూపు తరఫున విచారాన్ని వ్యక్తం చేస్తున్నాను.

శ్రీ బి. మోహన్ రెడ్డి (మెదక్, నిజమాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్) : అధ్యక్షా, శ్రీమతి లక్ష్మీదేవిగారు మొన్నటిదాకా ఈ సభలో మనతో ఉండి మరణించడం చాలా బాధాకరంగా ఉంది. వారి సేవలు ఈ రాష్ట్రానికి మరింత అవసరం ఉన్నాయి. ముఖ్యంగా గతంలో వారితో మాకు చక్కటి సంబంధాలు, మంత్రిగా ఆమె చేసిన సేవలను మేము మరువలేము. నేను పిఆర్‌టియు రాష్ట్ర అధ్యక్షులుగా ఉన్నప్పుడు, సెక్రటేరియట్‌లో క్రొత్త బిల్డింగులు ఏమీ లేవు. ఆమెను కలవడానికి మేము వెడుతుంటే, మంత్రిగా ఆమె, వారి భర్త కారులో వెడుతున్నప్పుడు నన్ను చూసి కారు ఆపి నన్ను పలకరించడం నేను జీవితంలో మరచిపోలేను. ఎందుకంటే మంత్రిగా ఉండి, యూనియన్ అధ్యక్షులుగా ఉండి, మీదగ్గరకు వస్తున్నాను అంటే, ఇప్పుడు మీటింగ్‌కు వెడుతున్నాను, మధ్యాహ్నం 3 గంటలకు రమ్మనిమని చెప్పారు. మేము ఆ సమయానికి వెళ్ళినప్పుడు ఆమె మాకు పనులు చేసిపెట్టారు. అప్పుడు సోషల్ వెల్ఫేర్ మంత్రిగా ఉండేవారు. ఆవిధంగా ఆమెతో మాకు చాలా అనుబంధం ఉండేది. ఆమె కాకుండా, వారి భర్త కూడా ఎక్కడ కనిపించినా మంచి, చెడు మాట్లాడుతూ చాలా ఆప్యాయంగా పలకరించేవారు. నిజంగా ఇవన్నీ జ్ఞాపకం వస్తూ చాలా బాధ కలుగుతోంది. ఏది ఏమైనా బ్రతుకున్నప్పుడు ఎంతమందికి సహాయం చేశామనేది ఈ సందర్భాలలో గుర్తుచేసుకుంటాము. ఆవిడ బీదలకు ముఖ్యంగా హాస్టల్ విద్యార్థులకు ఎక్కువగా సహాయసహకారాలు అందించారు. వారి మరణం పట్ల వారి కుటుంబానికి తీవ్ర సంతాపాన్ని తెలియజేస్తూ, లక్ష్మీదేవిగారికి ఆత్మ శాంతి కలగాలని కోరుకుంటున్నాను. శ్రీమతి లక్ష్మీదేవిగారికి స్వర్గప్రాప్తి కలగాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను.

శ్రీ పోచిరెడ్డి సుబ్బారెడ్డి (కడప, అనంతపూర్, కర్నూల్) : అధ్యక్షా, నా నియోజకవర్గంలో ఉపాధ్యాయురాలిగా ఉండి, ఒక క్రమశిక్షణాయుతమైన కార్యకర్తగా, అంచలంచెలుగా ఎదిగినటువంటి శ్రీమతి ఎం. లక్ష్మీదేవమ్మ మరణం తీవ్ర దిగ్భ్రాంతిని కలుగచేస్తున్నది. గౌరవ ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని నేను పూర్తిగా ఆమోదిస్తున్నాను. ఆమె మంచి ఉపాధ్యాయురాలు. లక్ష్మీదేవిగారు కాంగ్రెస్ పార్టీలో ఉండి, దళిత వర్గ నాయకురాలిగా, మహిళాభ్యున్నతికోసం పాటు పడిన నాయకురాలిగా, మంత్రిగా ఉన్నాకూడా ఎంతో సాదాసీదాగా వ్యవహరించిన వ్యక్తిగా శ్రీమతి లక్ష్మీదేవిగారిని గుర్తుంచుకోవలసిన అవసరం ఉంది. ఆమెలో ఉన్న శాంతస్వభావాన్ని, క్రమశిక్షణను మనం జీర్ణించుకుని, పదవులకోసం మనం కాదు, మనకోసం పదవులని ఆమె ప్రవర్తించిన తీరుకు పూర్తిగా ఆనందాన్ని ఏకీభావాన్ని వ్యక్తం చేస్తూ, ఆ మహనీయురాలు మరణానికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నాను. ఎందుకంటే నేను ఉన్నటువంటి క్వార్టర్సులోనే ఆమె కూడా ఉండేవారు. ప్రతిరోజూ ఆమె శాసన మండలికి వచ్చేటప్పుడు, వెళ్ళేటప్పుడు చాలా అనారోగ్యంతో బాధపడుతూ, కుటుంబ సభ్యుల ఆసరాతో వచ్చేటటువంటి పరిస్థితిని గమనించినప్పుడు చాలా బాధ కలిగేది. క్యాన్సర్ అనేది చాలా బాధాకరమైన జబ్బు, దాంతో వారు గతించడం చాలా బాధాకరమైన విషయం. వారి కుటుంబసభ్యులకు నా ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని తెలియజేస్తూ, నాకు ఈ అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను.

డా. పి.వి. రంగారావు (నామినేటెడ్) : అధ్యక్షా, మొన్నటివరకూ మనతోబాటు శాసనమండలి సభ్యురాలిగా ఇంకా తన పూర్తి కాలాన్ని వినియోగించుకోకుండానే, మన మధ్యనుంచి వెళ్ళిపోవడం బాధాకరమైన విషయం. శ్రీమతి లక్ష్మీదేవిగారు నాతోపాటు విజయభాస్కర రెడ్డి గారి మంత్రివర్గంలో పనిచేశారు. చాలా ఉత్తమమైన, దక్షురాలైన మహిళా నాయకురాలు. సామాన్యంగా అధికారంలో లేకపోతే నీరసించి, ఉండేవాళ్ళే చాలామంది. కానీ మనం ప్రభుత్వంలో లేనప్పుడు, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం లేనప్పుడు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మహిళా అధ్యక్షురాలిగా అనేక వందల, వేల కార్యక్రమాలు ఏర్పాటు చేసి, ముఖ్యంగా మహిళలలో గొప్ప చైతన్యాన్ని తీసుకువచ్చి, రాష్ట్రంలో మళ్ళీ కాంగ్రెస్ ప్రభుత్వం రావడానికి తన శాయశక్తులా కృషి చేసిన మహిళా నాయకురాలు శ్రీమతి లక్ష్మీదేవి.

ఉ. 10 .20

ఆమె ఒక ఆదర్శవంతమైన మహిళ. తన జీవితంలో ప్రజలప్రేమ అనే ఆస్తి తప్ప తనకంటూ ఆస్తి సంపాదించుకోకుండా, అనేకసార్లు ఎన్నికల్లో ప్రచారం చేయడానికి డబ్బులేకుండా ఇబ్బంది పడి, ఎలా ప్రచారం చేయాలా అని బాధపడుతున్న సందర్భంలో మేమంతా కళ్యాణ్‌దుర్గం వెళ్లి ఆమె ఎన్నికల్లో ప్రచారంలో పాల్గొనడం మాకు భగవంతుడు ఇచ్చిన అవకాశంగా భావిస్తున్నాము. ఎంతో మంచి భావాలున్న గొప్ప నాయకురాలు, వారు సిడబ్ల్యుసి మెంబరుగా ఉన్నపుడు కూడా అనేకమంది మహిళా నాయకురాళ్లను ప్రోత్సహించి చాలామందికి అవకాశం ఇచ్చారు. ఈ రోజు మహిళా నాయకురాళ్లు అనుకున్న ప్రతివారు లక్ష్మీదేవిగారి నాయకత్వం క్రింద పనిచేసినవారే అని భావించుతూ, వారి కుటుంబానికి భగవంతుడు మంచి భవిష్యత్తు ప్రసాదించాలని కోరుకుంటూ, ఆమెను ఎల్లప్పుడూ అనుసరించి ఉండే వారి భర్తగారికి, వారి కుటుంబసభ్యులకు నా ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తూ, సెలవు తీసుకుంటున్నాను .

డా. కె. రాజ్యలక్ష్మి (నామినేటెడ్) : అధ్యక్షా, శ్రీమతి లక్ష్మీదేవిగారి మృతిపట్ల గౌరవ ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని బలపరుస్తూ, లక్ష్మీదేవిగారితో నా అనుబంధం

దాదాపు 25 సంవత్సరాల నాటిది. వారు మంత్రిగా ఉన్నపుడు వుమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ నుండి ఎన్నో పథకాలు ద్వారా ఎంతోమంచి మేలు చేకూర్చిన చరిత్ర వారికి ఉన్నది. మహిళా కాంగ్రెస్ ప్రెసిడెంట్ గా ఉన్నపుడు అనేక జిల్లాల్లో మహిళా కార్యకర్తలను తయారుచేశారు. వారి తరువాత మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా నేను బాధ్యతలు తీసుకుని, వారి అండదండలతో పథనిర్దేశంతో పనిచేయడం జరిగింది. వారు మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలి పదవి వదులుకున్నా, శ్రీమతి సుమన్ కృష్ణకాంత్‌గారు ప్రవేశపెట్టిన కరుణ సొసైటీ అధ్యక్షురాలిగా చనిపోయేవరకు కొనసాగారు. ఆ సొసైటీ ద్వారా ఎంతో మంది మహిళలకు ఉపాధి కల్పన కార్యక్రమాలు చేపట్టారు. ఆ సొసైటీ శాఖలు భారతదేశమంతా ఉన్నాయి. వారు ఆ సొసైటీ ద్వారా ఎంతోమంచి సంబంధ బాంధవ్యాలు కూడా నెలకొల్పారు. ఇప్పటివరకు కూడా ఎంతోమంది సహచర సభ్యులు చెప్పినట్లుగా ఒక కుటుంబ స్త్రీగా ఎవరైనా చేతులెత్తి నమస్కారం చేసేంత గౌరవనీయంగా వారు ఉండేవారు. వారు జబ్బుతో దాదాపు పది సంవత్సరాల నుండి బాధపడుతున్నా, తరువాత కొంత కోలుకున్నారు. తరువాత ఆ జబ్బు తిరగబెట్టడం దురదృష్టకరం. గత రెండు సెషన్స్‌గా ఆమె ఈ సభకు రాలేకపోవడం ఎంతో లోటుగా అనిపించింది. మహిళలు, మహిళా కార్యకర్తలతో పాటు సోషల్ వర్కర్లు కూడా వారిని ఎన్నోవిధాలుగా మిస్ అవుతారు. ఈ సమయంలో వారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నాను.

శ్రీమతి నన్నపనేని రాజకుమారి (అసెంబ్లీ): అధ్యక్షా, లక్ష్మీదేవిగారు ఈ సభలో మనతోపాటు ఉంటారని భావించాను. మేము వారితో కలిపి పనిచేయకున్నా వారు మరణించారని పేపర్లో చూచినపుడు చాలా బాధ కలిగింది. 14 సంవత్సరాల 7 మాసాలు కాంగ్రెస్‌లో ఉన్నవ్యక్తిగా నేను ఆమె గురించి కొన్ని మంచిమాటలు చెప్పాలనే ఉద్దేశ్యంతో మాట్లాడాలని అనుకున్నాను. మహిళా అధ్యక్షురాలిగా ఆమె ఉన్నపుడు రాజ్యలక్ష్మిగారు ఉన్నారు, నేను ఉన్నాను. జమునగారి తరువాత నేను వచ్చాను. వారిని గాంధీభవన్‌లో జరిగిన ప్రతిఫంక్షన్‌కు పిలిచాను. ప్రతి మీటింగ్‌కు వారు వచ్చేవారు, వారు నిరాడంబరంగా ఉంటూ, రాజకీయంగా కొన్ని విలువలకు కట్టుబడిన వ్యక్తి. వస్త్రధారణలో 90 శాతం ఖద్దరు ధరించేవారు. కుటుంబంలో ఎన్నో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ఎంతోమంది ముఖ్యమంత్రుల దగ్గర, సి డబ్ల్యుసి సభ్యురాలిగా కూడా పనిచేశారు, వారిని ఎందుకు తొలగించారో మీకు తెలుసు. ఆమెకు నోరు కలిగి పోట్లాడే శక్తి లేకపోవడం, అడిగి పదవులు తెచ్చుకోవడం ఆమెకు ఇష్టం లేదు. ఢిల్లీలో సిడబ్ల్యుసి సభ్యురాలిగా అయినందుకు వారిని అభినందించాము. కొద్ది మాసాల తరువాత తీసివేసినందుకు చాలా బాధపడ్డారు కాని బయటపడి పోరాడలేదు. 1989 లో లోని గవర్నమెంట్‌లో ఆమె మంత్రి కావలసి ఉన్నప్పటికీ ఒక జూనియర్ మంత్రి అయినపుడు, జూబ్లీహాల్‌లో ఒకసారి మీరు సీనియర్ అయినా, జూనియర్‌కు మంత్రిపదవి ఇచ్చారని మేము అంటే, ఎంతవరకు ప్రాప్తముంటే అంతవరకే, నేను ఎవరినీ అడగను, పదవి దానంతట అదే రావాలని వారు అనడం జరిగింది. జనార్ధన రెడ్డిగారు ముఖ్యమంత్రిగా ఉన్నపుడు నన్ను పిలిపించి, లక్ష్మీదేవిగారు రాజీనామా చేశారు, మీరు వెళ్లి చూచిరండి అని అంటే నేను వారింటికి వెళ్లడం జరిగింది. చాలా చిన్న చిన్న గదులలో వారు ఉన్నారు. ఎన్నో మంత్రిపదవులు చేశారు, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఉన్నారు, ఎందుకు రిజైన్ చేశారని అడిగితే, నేను నమ్మిన వ్యక్తికోసం చేశాను అన్నారు. వారు నమ్మిన నాయకుడి ఆదర్శానికి వారు ఆ విధంగా స్పందించి పదవిని వదులుకున్నారు. చిన్న ఇంట్లోకి వెళ్లిపోయారు. వారిపైన ఎటువంటి అవినీతి ఆరోపణలు లేవు. పెద్ద నాయకుల మధ్య విభేదాలతో

విజయభాస్కర రెడ్డి గారి క్యాబినెట్‌లో ఆమెకు మంత్రి పదవి రాకపోవడానికి అదే కారణం అయింది. మంత్రి పదవి లేకపోయినా, డబ్బులేకపోయినా, ఎవరివద్ద ఒక మాట పడవద్దని వారు నమ్మిన నాయకత్వాన్ని వారు బలపరిచారని అనుకున్నారు. చాలామంది ఆడపిల్లలు వారికి ఉన్నారు, భర్తగారు కూడా ఎప్పుడూ వారి వెంటనే ఉండి, ఇద్దరూ కలిసి రావడం జరిగేది. దురదృష్టం, చివరిసారి చూడలేకపోయాను. పేపర్లో ఆ వార్త చూసేప్పటికే టైం ఐపోయింది. ఫోన్ చేస్తే అప్పటికే తీసుకుని వెళ్లపోయారని చెప్పారు. చాలా బాధపడ్డాను. వారిని మహిళలు చాలా ఆదర్శంగా తీసుకోవాలి, నీతి, నిజాయితీ, వస్త్రధారణ పద్ధతులు ఆమెదగ్గర నేర్చుకోవాలి. నీతి నిజాయితి ఉన్న దళిత నాయకురాలు. రాజకీయాలలోకి రాకముందు ఎలా ఉంటారు, వచ్చిన తరువాత మహిళలు గాని, మగవారు గాని ఏవిధంగా ఉంటారనే సంగతి నేను ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఆమె ఏ విధంగా రాజకీయాలలోకి వచ్చారో, ఎటువంటి పేద పరిస్థితులలో మరణించారో వింటే చాలా బాధ కలుగుతున్నది. అటువంటి మహిళ మరణం పైన ప్రవేశపెట్టిన తీర్మానం ద్వారా సానుభూతి తెలియజేయవలసి వచ్చినందుకు బాధ పడుతున్నాను. శ్రీ కె. రోశయ్యగారు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బలపరుస్తూ, లక్ష్మీదేవిగారిని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని కోరుతూ, వారి కుటుంబానికి ప్రభుత్వం తరఫున, పార్టీ తరఫున సహాయం చేయాల్సిన అవసరం ఉందని భావిస్తున్నాను. వారికి మనస్ఫూర్తిగా నివాళులర్పిస్తూ, వారి కుటుంబానికి భగవంతుడు శక్తి ప్రసాదించాలని కోరుకుంటూ, ఈ అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలుపుతున్నాను.

శ్రీ గాదె శ్రీనివాసులు నాయుడు (శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం) : అధ్యక్షా, లక్ష్మీదేవిగారి అకాల మరణానికి విచారం, బాధ వ్యక్తపరుస్తూ, నేటి మహిళాలోకానికి ఆమె జీవితం ఆదర్శప్రాయమైనదని తెలియజేస్తున్నాను. పేద మహిళల అభ్యున్నతి గురించి వారు ఎక్కువగా ఆలోచన చేసేవారు. వారికి ఆస్తిపాస్తులు లేకపోవడం వాస్తవం. రాజకీయాలలో సేవా తత్పరత ఉన్న ఇటువంటి వ్యక్తులను ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళ్లినపుడే వారికి నిజమైన నివాళి మనం ఇచ్చినట్లవుతుందని భావిస్తున్నాను. భార్య, భర్త ఎప్పుడూ ఒకరివెంట ఒకరు ఉంటూ, పార్వతీపరమేశ్వరులు లాగా ఉండడం అందరూ చూచి ఉంటారు. ఆ విధంగా అన్యోన్యంగా, ఆదర్శంగా, శాంతిగా ఏ సమస్య వచ్చినా పరిష్కరించుకుని, ప్రజాసేవకు అంకితమైన ఆమె మన మధ్య లేకపోవడం చాలా విచారంగా ఉంది. వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ, వారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.

ఉ.10.30

శ్రీ జి. తిప్పేస్వామి (అసెంబ్లీ) : అధ్యక్షా, కీర్తిశేషులు లక్ష్మీదేవమ్మ గారు అనంతపురం జిల్లావాసి. ఆమె దళిత కుటుంబంలో పుట్టి, మహిళా శిశు సంక్షేమ శాఖలో ఒక అధికారిగా వుంటూ, ఒక శాసన సభ్యురాలిగా ఎన్నిక కావడం, మంత్రి అవడం, ఎంఎల్‌సి కావడం మరీ ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీలో విధాన నిర్ణాయక మండలి ( సిడబ్ల్యుసి ) మెంబర్ కావడం చాలా గొప్ప విషయం. నాకు తెలినంతవరకు అనంతపురం జిల్లాలో మొట్టమొదటి సిడబ్ల్యుసి మెంబర్ ఆమే.

మిస్టర్ చైర్మన్ : మీ జిల్లాలో నీలం సంజీవరెడ్డి గారు చాలా కాలం క్రితమే సిడబ్ల్యుసి మెంబర్ అయ్యారు.

శ్రీ జి. తిప్పేస్వామి : ఆ విషయం నాకు తెలియదు సర్. ఆమెకు వచ్చిన ప్రమాదకరమైన వ్యాధి చికిత్సకు కావలసిన డబ్బులు ఆమె వద్ద లేనపుడు మానవతావాది, మహోన్నతమైన వ్యక్తి, మన మాజీ ముఖ్యమంత్రి అయిన కీర్తి శేషులు డా. వైఎస్ రాజశేఖర రెడ్డి గారు రూ.15 లక్షల మొత్తాన్ని ఖర్చుల కోసం మంజూరు చేయడం జరిగింది.

ఇటీవలనే ఆమెను ఆమె నివాసంలో కలిసినపుడు ఆమె కంట తడి పెట్టి అన్నారు, '' వైఎస్ నా ప్రాణాన్ని కాపాడారు, నన్ను బ్రతికించి, నాకు ప్రాణాన్ని దానం చేసి, అతని ప్రాణాన్ని పోగొట్టుకున్నారని '' చెప్పడం జరిగింది. ఆమె అనంతపురం జిల్లాలో మొట్టమొదటి గ్రాడ్యుయేట్ క్యాండిడేట్. ఆమె లేని లోటు కాంగ్రెస్ పార్టీకి, అనంతపురం జిల్లాకు, మహిళా లోకానికి తీవ్రమైన నష్టమని ఈ సందర్భంగా మనవి చేస్తూ, ముఖ్యమంత్రి రోశయ్య గారు సభలో లేరు, ప్రభుత్వపరంగా వారు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బలపరుస్తూ, వారి కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని కోరుతూ, ఆమె ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తున్నాను.

శ్రీమతి మజ్జి శారద (నామినేటెడ్) : అధ్యక్షా, శ్రీమతి లక్ష్మీదేవమ్మ గారితో నాకు గల పరిచయం చాలా తక్కువే కాని ఆమె నన్ను బాగా ప్రోత్సహించి ముందుకు తీసుకెళ్లిన నాయకురాలిగా ఆమె ఎప్పుడూ నా జ్ఞాపకాలలో వుంటారు. ఆమె అణగారిన వర్గాలకు, అణగ ద్రొక్కబడిన ప్రజలకు ఎప్పుడూ అండదండగా వుంటూ, వారిలో ఏ మాత్రం ప్రతిభా పాటవాలు వున్నా, వారిని బాగా ప్రోత్సహించి, తనతోపాటుగా ముందుకు తీసుకెళ్లిన మంచి నాయకురాలు ఆమె. ఆమెది చాలా కష్టపడే తత్వం . నిజానికి ఆమె యొక్క కష్టపడే తత్వమే ఆమెను అనేక ఉన్నత పదవులకు దగ్గర చేసింది.

ఎన్ని ఉన్నత పదవులను అలంకరించినప్పటికీ, ఆమె చాలా వినమ్ర స్వభావంతో వుండే వారు. అందరినీ చాలా ఆప్యాయంగా పలకరిస్తూ, చిన్న వారిలో చిన్న వారుగా, పెద్ద వారిలో పెద్ద వారుగా వుంటూ, అన్ని విషయాలనూ డిస్కస్ చేసే వారు. ఒక్కొక్కసారి ఆమె అభిప్రాయాలతో ఏకీభవించకపోయినా, ఎదుటి వారి అభిప్రాయాలను గౌరవిస్తూ, వారిని ప్రోత్సహిస్తూ, మాట్లాడాలని భుజం తట్టి ప్రోత్సహించిన నాయకురాలు ఆమె. అటువంటి ఆమె మన మధ్య లేకపోవడమనేది కాంగ్రెస్ పార్టీకే కాదు, అణగద్రొక్కబడిన వర్గాలకు, అణగారిన వర్గాల ప్రజలకు ముఖ్యంగా మహిళలకు లోటని నేను చాలా గట్టిగా విశ్వసిస్తున్నాను. ఏది ఏమైనా, ఆమె గత కొంత కాలంగా హౌజ్‌కు రావడం లేదు. అడిగితే ఒంట్లో బాగోలేదని అన్నారు. కాని ఇంత హఠాత్తుగా ఆమె చనిపోతారని ఊహించలేదు. చివరి నిమిషం వరకూ ఆమె నియోజకవర్గంలో ప్రజల మధ్యనే వున్నారని విన్నపుడు ఆ నియోజకవర్గ ప్రజలతో అనుబంధం ఎంత బలీయంగా వుందో అనిపించింది నాకు.

జన్మించిన వారు మరణించక తప్పదు. అందులో ఆమె వయసు కూడా 72 సంవత్సరాలు అనుకుంటాను. నిన్ననే గాంధీ భవన్‌లో వారి సంతాప సభ జరిగినపుడు మంత్రి రఘువీరారెడ్డి గారు వున్నారు, ఆమె ఎన్ని ఉన్నత పదవులను అలంకరించినా వారి కుటుంబ ఆర్థిక పరిస్థితులు బాగా లేవని చెప్పినపుడు చాలా బాధ అనిపించింది. అందువల్ల ఆ విషయాన్ని దృష్టిలో వుంచుకుని, ప్రభుత్వం వారి కుటుంబానికి చేయూతనిస్తే బాగుంటుందని నేను భావిస్తున్నాను. ప్రభుత్వం వారికి ఆర్థిక సహాయం చేయాలని కోరుతున్నాను. వారి మరణం పట్ల నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుని ప్రార్థిస్తూ, ముఖ్యమంత్రి గారు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బలపరుస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ రుద్రరాజు పద్మరాజు (అసెంబ్లీ) : అధ్యక్షా, గత కొంత కాలంగా అస్వస్తతగా వుంటూ, రాజకీయాలలో సుమారు నాలుగున్నర నుంచి ఐదు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఈ రాష్ట్రానికి ఎన్నో ఎనలేని సేవలు అందించిన శ్రీమతి లక్ష్మీదేవమ్మ గారి మరణం ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీని, యావత్ ఆంధ్రరాష్ట్రాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి లోను చేసింది. శ్రీమతి లక్ష్మీదేవమ్మ గారు క్రమ శిక్షణకు, నీతి నిజాయితీలకూ నిలువుటద్దం. అదే విధంగా నిరాడంబరత కాని, నిగర్వితనం కాని, ఆమెకు ఈ రెండూ రెండు ఆభరణాలు. ఆమె రెండు పర్యాయాలు శాసన మండలికి ప్రాతినిధ్యం వహించి, రెండు పర్యాయాలు శాసన సభకు ప్రాతినిధ్యం వహించడం జరిగింది. 1972లో మొట్టమొదటిసారిగా శాసన సభకు ప్రాతినిధ్యం వహించినపుడు నాటి ముఖ్యమంత్రి వెంగళరావు గారి క్యాబినెట్‌లో ఆమె మంత్రిగా వ్యవహరించడం జరిగింది. అదే విధంగా రెండోసారి శాసన సభకు 1989లో ప్రాతినిధ్యం వహించినపుడు జనార్ధన రెడ్డి గారి క్యాబినెట్‌లో కాని, విజయ భాస్కర రెడ్డి గారి క్యాబినెట్‌లో కాని మంత్రి పదవులను అలంకరించి, ఆ పదవులకే వన్నె తెచ్చిన ఒక మహా దళిత నాయకురాలు ఆమె అని అభివర్ణించక తప్పదు.

వారి కుటుంబంతో నాకు సుమారుగా రెండున్నర దశాబ్దాలుగా పరిచయం వుంది. నేను రాష్ట్ర యువజన కాంగ్రెస్‌లో వున్నప్పటి నుంచీ ఆమెను బాగా గమనిస్తూ వుండేవాడిని. మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా వున్నపుడు రాష్ట్రంలో నలు మూలలా తిరుగుతూ, అనేకమైన మహిళల సమస్యలపై ఉద్యమిస్తూ మహిళా చైతన్యాన్ని నింపిన ఒక మహోన్నతమైన వనిత ఆమె అని ఈ సందర్భంగా చెప్పక తప్పదు. కాంగ్రెస్ పార్టీలో అత్యున్నత స్థాయి అయిన సిడబ్ల్యుసి మెంబర్‌గా ఆంధ్ర రాష్ట్రం నుంచి ఒక ప్రప్రథమ దళిత మహిళగా ప్రాతినిధ్యం వహించడం, దళిత జాతికంతటికీ గర్వకారణమైన విషయం .

ఆమె ఆర్థిక పరిస్థితి గురించి అనేక మంది పెద్దలు చెప్పారు. ఒక రోజు ఉదయం నాకు ఆమె ఫోన్ చేసి పద్మరాజూ, నాకు ఒక చిన్న సహాయం చేయాలని అడిగారు. ఏమిటమ్మా అంటే, నేను రెండు లక్షల రూపాయలకు బ్యాంకు లోన్ పెట్టాను, నువ్వు గ్యారంటర్‌గా సంతకం పెట్టాలని అన్నారు. అదేమి పెద్ద భాగ్యమమ్మా, తప్పనిసరిగా సంతకం చేస్తానని చెప్పి, సంతకం చేయడం జరిగింది. తరువాత తెలిసింది, ఆమె జన్మ స్థలంలో ఒక దేవాలయాన్ని నిర్మించి, మునియప్ప అనే ఒక కేంద్ర మంత్రితో ప్రారంభోత్సవం చేయించేందుకు కావలసిన వనరులు లేని పరిస్థితులలో బ్యాంకు లోను తీసుకుని ఆ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.

నాకు అప్పుడు ఆమెలో వున్న నీతి నిజాయితీలు, అపారమైన భక్తి ప్రస్ఫుటంగా కనిపించాయి. అటువంటి మహనీయురాలు ఇప్పుడు ఇక్కడ లేకపోవడం మన దురదృష్టం . మన కళ్ల ముందరే మొన్నటి వరకూ వుండి, ఈ రోజు ఇక్కడ లేకపోవడం మనందరి దురదృష్టం . ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తూ, శోకార్తులైన ఆమె కుటుంబ సభ్యులకు నా ప్రగాఢమైన సానుభూతిని తెలియజేస్తూ, ముఖ్యమంత్రి రోశయ్య గారు ప్రవేశపెట్టిన తీర్మానానికి నా సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నాను.

శ్రీ కందుల లక్ష్మీ దుర్గేష్ ప్రసాద్ (అసెంబ్లీ) : అధ్యక్షా, లక్ష్మీ దేవమ్మ గారి మృతి అందరికీ చాలా తీవ్రమైన బాధ కలిగించే సంఘటన. ముఖ్యంగా ఆల్ఫాబెటికల్‌గా సీటింగ్ అరేంజ్‌మెంట్ చేయడం వల్ల, నా పేరు లక్ష్మీ దుర్గేష్ ప్రసాద్ అవడంవల్ల, లక్ష్మీ దేవమ్మ గారి ప్రక్కన కూర్చుని ఈ సమావేశాలలో పాలు పంచుకునే భాగ్యం కలిగింది. గడచిన 3 సంవత్సరాలుగా ఈ సీటులోనే కూర్చుని చాలా సందర్భాలలో, చాలా విషయాలలో ఆమె

నుండి ఎన్నో సలహాలను పొందడం జరుగుతూ వుండేది. ఇప్పుడు ఉదయం వచ్చి చూస్తే, నా ప్రక్కన వున్న ఆమె పేరు స్థా నంలో ' వేకెంట్ ' అని వుంది. ఇది చాలా బాధ కలిగించే విషయం . కీర్తి శేషులు ఎంవిఎల్ గారు చెప్పినట్లుగా, ' కళ్లు తెరిస్తే జననం, కళ్లు మూస్తే మరణం, రెప్ప పాటు ఈ జీవితం ' అన్న విధంగా నిన్నటి వరకూ మన మధ్య సజీవంగా వుండి, ఆమె పేరు ఇక్కడుండేది. ఈ రోజు ఆమె లేకపోయేసరికి ఇక్కడ 'వేకెంట్' కార్డు పెట్టేసారు.

ఉ. 10.40

ఇది చూసిన వెంటనే నాకు చాలా బాధ కలిగింది. ముఖ్యంగా లక్ష్మీదేవిగారి గొప్పతనం గురించి ఈ సభలో జరిగిన రెండు, మూడు సంఘటనలను ఆధారం చేసుకుని చెబుతాను. ఆమెకు పార్లమెంటరీ సాంప్రదాయాలపట్ల గొప్పనమ్మకం, విశ్వాసం ఉంది. సభలో ఎక్కడయినా వాదోపవాదాలు జరిగినప్పుడు ఛైర్మన్‌గారు కూర్చోండని అన్నప్పుడు, కూర్చోకుండా మళ్లీ అలాగే చెబుతూ ఉంటే ఆమెకు వెంటనే ఆశ్చర్యం కలిగేది. ఛైర్మన్‌గారు చెప్పిన తరువాత కూడా మాట్లాడుతున్నారని అనేవారు. ఛైర్మన్‌గారు ఒక మాట చెబితే దానిని తూ.చ., తప్పక పాటించాలనేది ఆవిడ నమ్మకం. పార్లమెంటరీ సాంప్రదాయాలను ఆ విధంగా మనఃస్ఫూర్తిగా నమ్మిన వ్యక్తిగా, వారు ఆ మాట చెప్పిన వెంటనే నాకు తెలిసింది. ఛైర్మన్‌గారు చెప్పిన తరువాత కూడా మాట్లాడుతున్నారే, ఎందుకు గట్టిగా మాట్లాడతారని అనే వారు. ఆమె చెప్పిన మాటలు విని ఆ రకంగా ఉండడం అనేది సరైన సాంప్రదాయాన్ని పాటించడంఅని అనిపిస్తుంది. చాలా సందర్భాలలో చాలా మంది లేచి మాట్లాడుతూ ఉంటే, వారు ఏ ప్రాంతం నుండి వచ్చారు, ఎవరని నన్ను చాలా సందర్భాలలో అడిగి తెలుసుకునేవారు. ప్రతీ విషయం పట్ల పూర్తి పరిజ్ఞానం, అవగాహన ఉండేది. ఎక్కువ మాట్లాడడానికి ఇష్టపడేవారు కాదు. నేను మాట్లాడినప్పుడు బాగా మాట్లాడావనో లేదా ఇలా మాట్లాడితే బాగా ఉండేదనో, ఏదో ఒక కాంప్లిమెంట్ చేసేవారు. గడచిన మూడు సంవత్సరాల నుండి వారి ప్రక్కన కూర్చునే మహద్భాగ్యం నాకు కలిగింది. తద్వారా కొన్ని విషయాలను తెలుసుకునే అవకాశం కూడా నాకు లభించింది. అటువంటి మహనీయురాలు ఆమె. ప్రజా జీవితం అంటే, పేద ప్రజల సంక్షేమం అని దాని కోసమే పాటుపడ్డారు. వారి సంక్షేమాన్నే కోరారు. వారు లేని లోటు భర్తీ చేయలేమని ఈ సందర్భంగా తెలియచేస్తున్నాను. వారి మృతికి తీవ్ర సంతాపాన్ని వ్యక్తపరుస్తూ, వారి కుటుంబానికి సానుభూతిని ప్రకటిస్తూ ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన ఈ సంతాప తీర్మానాన్ని బలపరుస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ జూపూడి ప్రభాకరరావు (నామినేటెడ్) : శ్రీమతి లక్ష్మీదేవిగారి అకాల మరణం ఆశ్చర్యానికి గురిచేయడమే కాకుండా బాధను కలిగించింది. ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన ఈ సంతాప తీర్మానాన్ని బలపరుస్తూ, బాధాతప్త హృదయంతో తమ ముందు రెండు విషయాలు చెప్పదలిచాను. దాదాపు 23 రోజుల క్రితం వారి ఇంటికి వెళ్లాను. వారు కుకట్‌పల్లిలో ఉంటారు. నేనూ అక్కడే ఉంటాను. వారి ఇంటికి వెళ్లి చూసినప్పుడు నాకు చాలా బాధ కలిగింది. క్రితం సారి జరిగిన సెషన్‌లో వారు రాలేకపోయారు. ఆసుపత్రిలో ఉన్నారనీ, కదలలేని పరిస్థితిలో ఉన్నారని తెలిసి తరువాత వారి ఇంటికి నేను వెళ్లాను. ఆమె శరీరం మొత్తం నల్లగా మారిపోయి, బాధతో నన్ను చూసి నాయనా, నేను కౌన్సిల్‌లో మీతో ఉన్నా, పోయిన సారి రాలేకపోయాను. ఈసారి కూడా రాలేకపోవచ్చునని అన్నారు. నేను ఒక పెద్ద దానిగా చెబుతున్నానని, వారి భర్తతో నన్ను చూపిస్తూ, ఈ 'అప్ప'అని సంబోధిస్తూ అన్నారు. ఆ ప్రాంతం వారు ఆ విధంగానే మాట్లాడతారు. ఈ అప్ప చాలా చక్కగా మాట్లాడతారు. దళితుల తరపున నేను లేకపోయినా నా గొంతును ఈ అప్ప ద్వారా కౌన్సిల్‌లో నేను విన్నానుఅని చెప్పారు. వచ్చేసారి సమావేశానికి రాలేకపోవచ్చుననే బాధను ఆ రోజు వారు వ్యక్తపరచారు.

వారు ఊరికి వెళ్లి ఆ ఊళ్లోనే చనిపోయినారని తెలిసిన తరువాత వారికి ప్రజలపట్ల ఎంత ప్రేమ ఉన్నదో తెలుస్తోంది. దేవుడంటే చాలా భక్తి. ఒక దేవాలయం ప్రారంభోత్సవానికి వెళ్లారని తెలిసింది. దళిత మహిళగా వారు అనేక పదవులను అధిరోహించారు. అణగారిన వర్గాల ప్రజల భావాలను, వారి బాధలను వినిపించే క్రమంలో శక్తివంచన లేకుండా లక్ష్మీదేవిగారు పాటుపడ్డారు. వారు దాదాపు 45 సంవత్సరాల రాజకీయ జీవితంలో చివరి దశలో చాలా బాధపడ్డారు. ఏ మాత్రమూ ఆస్తులు, కీర్తి కిరీటాలు లేకుండా సామాన్య మహిళలాగా పరమపదించారు. ఇది వారి నిరాడంబరతకు తార్కాణం. రాజకీయాలలో ఉన్న వ్యక్తులు ఎవరైనా ఈ విధంగానే జీవితాన్ని కొనసాగించాలి. ఆ పదవులకు, ఆ కులాలకు గౌరవం వచ్చే విధంగా ఉండాలనే సాంప్రదాయాన్ని ఆవిడ మిగిల్చారు. ఇదే వరుసలో కూర్చున్నప్పుడు వారితో చాలా విషయాలు మాట్లాడాను. అప్పాఅని మాట్లాడేవారు. దళితుల తరఫున మనందరం ఏకంగా ముక్త కంఠంతో మాట్లాడాలని ఎక్కడా రాజీపడే అవసరం లేదని చాలా సందర్భాలలో చెప్పేవారు. వారి మరణం తీరని లోటు. దానిని ఎవరూ భర్తీ చేయలేము. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, నాకు మాట్లాడడానికి అవకాశం కల్పించినందుకుగాను ధన్యవాదాలు తెలియచేస్తున్నాను.

శ్రీ బి. చంగల్‌రాయుడు (అసెంబ్లీ) : అధ్యక్షా, ఈ పునరుద్ధరించబడిన శాసనమండలిలో సభ్యురాలిగా ఉంటూ దివంగతురాలైన మొట్టమొదటి వ్యక్తి లక్ష్మీదేవిగారు. ఆమె మరణించిన వార్త విన్న తరువాత చాలా బాధపడిన వ్యక్తులలో నేను ఒకడిని. ప్రముఖ కవులను పిలిచి ఒక సబ్జెక్ట్ మీద కవిత్వం వ్రాయమనే ఒక అలవాటు నాకు ఉంది. ఆ రోజు అంబేద్కర్‌గారు రిజర్వేషన్‌ను రాజ్యాంగంలో తీసుకువచ్చారు. ఎస్.సి., ఎస్.టి, ఆంగ్లో ఇండియన్‌లకు రిజర్వేషన్ కల్పిస్తూ, మహిళలకు రిజర్వేషన్‌ను మరచిపోయారేమోఅని ఒక పాట వ్రాయించి ఆమెకు వినిపించాను. పాట వారికి బాగా వచ్చింది, అంబేద్కర్ మరచిపోయారన్న విషయం నువ్వు నాకు గుర్తు చేయడం ఇష్టం లేదని వారు చెప్పారు. ఈ రోజు మహిళలకు రిజర్వేషన్ కావాలని రెండు, మూడు సార్లు ప్రయత్నాలు జరిగినా అది నోచుకోలేని పరిస్థితిలో ఈ పాట ఉపయోగపడుతుందనే ఉద్దేశంతో వ్రాసిందే తప్ప మరొకటి కాదు. అయితే అంబేద్కర్ మరచిపోయారన్న పదం బయట పడరాదని వారు అన్నారు. మహిళా రిజర్వేషన్ లేకపోయినా బాధ లేదు కానీ అంబేద్కర్‌గారు మరచిపోయారన్న విషయం బయటకు రానివ్వవద్దని అన్నారు. ఆమె కట్టులోనూ, పెట్టే బొట్టులోనూ, పలకరింపులో ప్రత్యేకత ఉంది. ఇందాక నన్నపనేని రాజకుమారిగారు అన్నారు. ఆమె ఖద్దరు బట్టలే వాడేవారని చెప్పారు. ఒకరోజు నాతో వారొక మాట అన్నారు. నేను ఎంఎల్ఏ.,గా గెలవకపోవడానికి కారణం కేవలం రూ.15,000. రూ.15,000 లేక ఓడిపోయానన్నారు. అటువంటి ఆర్థిక పరిస్థితి వారిది. దుర్భరమైన పరిస్థితిని అనుభవించారు. మంత్రిగా చేశారు. ఎంఎల్ఏగా చేశారు. ఎంఎల్సిగా చేశారు. వారి భర్త ఎప్పుడూ వారి వెంటనే ఉండేవారు. వీరు లోపలికి వచ్చి వెళ్లేదాకా బయటనే ఉండేవారు. చాలా సఖ్యంగా పలకరించుకుంటూ వస్తూ ఉండేవారు. వారు ఇద్దరూ ఒకటిగా ఉండేవారు. అన్యోన్యమైన కుటుంబం అది. చాలా సౌఖ్యంగా పలకరించుకుంటూ ఉంటే చాలా బాగుండేది. ఆమె లేని లోటు తీర్చలేనిది. వారి మరణానికి ప్రగాఢమైన సంతాపాన్ని తెలియచేస్తూ, వారి కుటుంబానికి సానుభూతిని తెలుపుతూ వారి ఆత్మకు శాంతి చేకూరాలని దేవదేవుడైన సర్వేశ్వరుడిని కోరుతూ, ఈ సంతాప తీర్మానాన్ని బలపరుస్తున్నాను.

శ్రీ మహమ్మద్ షేక్ హుస్సేన్ (నామినేటెడ్) : 'జాతస్యహి మరణం ధృవం' అని ఆర్యోక్తి. పుట్టిన ప్రతి వ్యక్తి మరణించవలసినదే. ఆ మాటకు వస్తే, దృగ్గోచరమైన ప్రతీదీ నాశనమయ్యేదే. దృగ్గోచరం అంటే కంటికి కనిపించేది. కంటికి కనిపించే ప్రతీదీ నాశనం కాకతప్పదు. కాబట్టి ప్రతి ఒక్కరమూ చనిపోతాము. అయితే

వారు చేసిన బాగోగుల గురించి ప్రస్తావించుకుంటాము. అవి మాత్రమే ప్రపంచంలో, సమాజంలో నిలిచిపోతాయి. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా ఆమెతో నాకు సత్సంబంధాలున్నాయి. సిడబ్ల్యుసి, స్థాయికి ఎదిగిన నాయకురాలు ఆమె. మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా, మంత్రిగా పని చేశారు. ఎంఎల్ఏగా చాలా సార్లు గెలవడం జరిగింది. ప్రత్యేకమైన లక్షణాలు, గుణాలు ఆమెలో ఉన్నాయి. ఆ విషయాలన్నీ చాలా మంది ప్రస్తావించారు. నాకు బాగా నచ్చిన విషయం నిరాడంబరత. మనకు కొన్ని పదవులు లభించిన తరువాత మనసులో కొంత మార్పు వస్తుంది. కానీ అటువంటి మార్పు లేకుండా నిరాడంబరంగా సహజసిద్ధంగా ఉండేవారు అతి తక్కువ మంది ఈ సమాజంలో ఉంటారు.

ఉ.10.50

దళిత కుటుంబం నుంచి ఉన్నత స్థాయికి ఎదిగినటువంటి కీర్తిశేషులు శ్రీమతి లక్ష్మీదేవమ్మ గారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియచేస్తూ, గౌరవ ముఖ్యమంత్రి గారు ప్రవేశపెట్టినటువంటి సంతాప తీర్మానాన్ని సమర్థిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీమతి సి.హెచ్. గంగాభవాని (పశ్చిమగోదావరి) : అధ్యక్షా, శ్రీమతి లక్ష్మీదేవమ్మ గారు పరమపదించిన సందర్భంగా ప్రవేశపెట్టిన సంతాప తీర్మానంలో మాట్లాడటానికి నాకు చాలా బాధగా ఉంది. మహిళా అధ్యక్షురాలుగా ఆమెతో నాకు దాదాపు రెండు దశాబ్దాల అనుబంధం ఉంది. నాకు మహిళా అధ్యక్షురాలుగా పదవి వచ్చిన సందర్భంలో లక్ష్మీదేవి గారికి పాదాభివందనం చేసి ఆశీర్వదించమని అడిగినప్పుడు ఇది చాలా కష్టమైన పని, నాలుగు గుండ్లు కలిసి ఉంటాయి కాని రెండు కొప్పులు కలిసి ఉండవంటారు అని అమ్మ అన్నారు. అలాంటి మహిళా కాంగ్రెస్‌లో ఆంధ్రప్రదేశ్‌లో సుదీర్ఘ కాలంపాటు ఎలాంటి వివాదాలకు తావు లేకుండా చాలా చక్కగా, సమర్థవంతంగా పని చేసి మంచి పేరు తెచ్చుకొన్నారు కాబట్టి మీ ఆశీస్సులు నాకు కావాలంటే తప్పకుండా నా ఆశీస్సులు నీకు ఎప్పుడూ ఉంటాయి అంటూ, నీకు కూడా ఆ లక్షణాలు ఉన్నాయన్నారు. అది నా అదృష్టం. నేను లక్ష్మీదేవి గారికి ఏకలవ్య శిష్యురాలిని. ఇంతకు ముందు గౌరవ సభ్యురాలు చెప్పినట్లు, కట్టుబొట్టులో అయితేనేమి, నిగర్వీగా ఉండడంలో అయితేనేమి, అత్యున్నత స్థానంలో ఉన్నా కూడా పదవి వల్ల ఎలాంటి గర్వం ఆమె పొంద లేదు. రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా నేను అనంతపురం జిల్లాకు వెళ్లినప్పుడు అక్కడ దేవమ్మ అనే మహిళ, జిల్లా అధ్యక్షురాలిగా ఉన్న విషయాన్ని గమనించాను. ఆ జిల్లాలో ఒక మహిళ రాజకీయంగా పైకి రావడమనేది కష్టాతి కష్టమైన విషయం. అలాంటిది, లక్ష్మీదేవి గారు ఒక ఎస్సీ మహిళ అయి ఉండి తోటి మహిళలను పైకి తీసుకురావడానికి ప్రోత్సాహాన్ని అందించే వారు. అనంతపురం జిల్లాలో దళిత మహిళలలో శ్రీమతి లక్ష్మీదేవి గారే మొదటి గ్రాడ్యుయేట్ అని నిన్న గాంధీభవన్‌లో జరిగిన సంతాప సభలో విన్నాను. బాగా చదువుకుని, సబ్జెక్టు మీద మంచి అవగాహన, సమర్థత కలిగి, చక్కటి భాష కలిగి ఉండి రాజకీయాలలోకి వచ్చి అత్యున్నత స్థానం సంపాదించుకోవడం ఒక వంతు అయితే, ఆ స్థానాన్ని, ఆ గౌరవాన్ని సుదీర్ఘ కాలం పాటు ఒక మహిళ నిలుపుకోవడం చాలా కష్టంతో కూడిన పని. ఆర్థికంగా ఆమె చాలా చితికిపోయారని సభలో చాలా మంది గౌరవ సభ్యులు చెప్పారు. అది కూడా ఆమె ఔన్నత్యానికి, వన్నెకు, కీర్తికి ఒక మెట్టు ఎక్కినట్లే కనిపిస్తోంది. ఎందుకంటే, రాజకీయాలలో ఉన్న వారందరూ బాగా డబ్బు సంపాదించుకుంటారని ప్రజలలో ఒక అపోహ ఉంది. దానికి విరుద్ధంగా, రాజకీయ నాయకులు నిజంగా ప్రజా సేవ చేయాలనే ఉద్దేశ్యంతో ఆమె ఉండేవారు. శ్రీమతి లక్ష్మీదేవి గారు సంజీవరెడ్డి నగర్‌లో టు ఆర్‌టిలో ఉండేవారు. అది చాలా చిన్న ఇల్లు. అవసాన దశలో ఆర్థిక పరిస్థితి బాగా లేక ఆ ఇల్లు కూడా అమ్ముకొని కూకట్‌పల్లిలో వాళ్ల అమ్మాయి దగ్గర కొద్ది డబ్బులు ఉంచి ఉండేవారు. ఇలాంటి సాధకబాధకాలన్నీ నాతో ఆమె

చెప్పుకొనే వారు. ఇలాంటి పరిస్థితుల్లో కూడా ఆమె ఇంటికి మా లాంటి వాళ్లం ఏ సమయంలో వెళ్లినా అతిథి మర్యాదలు చేయడం కోసం ఒక వంట మనిషిని పెట్టుకొన్నారు. ఆమె ఇంటికి ఎప్పుడు వెళ్లినా అతిథి మర్యాదలు బాగా చేసేవారు. కాబట్టి, నిజంగా మా అందరికి ఆమె ఆదర్శ మహిళ. ఆమెను చూచి నేర్చు కోవాల్సింది చాలా ఉంది. ముఖ్యంగా కట్టు, బొట్టు విషయంలో మాత్రం ఆమెను చూసి నేర్చుకోవలసిందే. అమ్మా మీ సింప్లిసిటీ చాలా బాగుంటుందని నేను పదే పదే పొగిడేదానిని. నాతో ఆమె మీరు కూడా చాలా సింపుల్‌గానే ఉంటారనే వారు. అప్పుడు నేను నా సింపుల్ కన్నా మీరు తెల్ల ఖాదీ చీరెలు కట్టే విధానమే చాలా బాగుంటుందనీ, లావుగా ఉంటేనే ఖాదీ చీరెలు కట్టగలం కదా అంటే, సన్నగా ఉండే వాళ్లకు కూడా పనికి వచ్చే క్వాలిటీ ఉన్న ఖాదీ చీరెలు ఫలానా షాపులో దొరుకుతాయని చెప్పడం జరిగింది. నేను ఆ డ్రస్ కోడ్‌ను జాతీయ పర్వదినాల సమయంలోనూ, కాంగ్రెస్ పార్టీ అకేషన్లలో తప్పకుండా ధరిస్తూ ఆమెనే అనుకరిస్తుంటాను. ఒక దళిత మహిళగా శ్రీమతి లక్ష్మీదేవి గారు వెంగళరావు గారి క్యాబినెట్‌లో మంత్రిగా ఉండడం, రెండు సార్లు అసెంబ్లీకి ఎన్నిక కావడం, ఆర్థికంగా చాలా క్లిష్ట పరిస్థితులలో ఉన్నా కూడా అనంతపురం జిల్లాలో రెండు సార్లు ప్రజల నుండి ఎన్నుకోబడిన వారు . అదే విధంగా, శ్రీ యన్. జనార్ధన రెడ్డి గారి మంత్రి వర్గంలోనూ, శ్రీ కోట్ల విజయ భాస్కర రెడ్డి గారి మంత్రి వర్గంలోనూ మంత్రిగా పని చేశారు. అన్నింటికంటే అత్యున్నతమైనటువంటి సిడబ్ల్యుసి మెంబర్‌గా ఆమె పని చేశారు. అసెంబ్లీ టికెట్ కోసం నా గురించి సోనియా గాంధీ గారితో కూడా చెప్పారు. నా జిల్లాకు లక్ష్మీదేవి గారు వచ్చినప్పుడు జిల్లాలోని ప్రజలకు నాపై ఉన్న అభిమానాన్ని చూచి అసెంబ్లీ టికెట్ తప్పకుండా నాకు రావాలని సోనియాగాంధీ గారికి చెప్పడం జరిగింది. రాజ్యసభ మెంబర్ కోసం ఒకసారి మేమందరం సోనియా గాంధీ గారిని కలిసినప్పుడు ఎస్టీ అయితే కమలకుమారి గారికి, ఎస్సీ అయితే ఒక్క లక్ష్మీదేవి గారికే ఇవ్వాలని సోనియాగాంధీ గారిని కోరడం జరిగింది. ఇప్పుడు రాజ్యసభ మెంబర్‌గా మహిళల తరఫున శ్రీమతి రత్నాబాయి గారికి ఇచ్చారు. గత 20 సంవత్సరాల నుండి ఆంధ్రప్రదేశ్ నుండి రాజ్యసభ మెంబరుగా మహిళలకు ఇవ్వడం లేదని, ఒకవేళ మహిళలకు ఇస్తే లక్ష్మీదేవి గారికే ఇవ్వాలని, మేరీ రవీంద్ర నాథ్ గారు, రత్నాబాయి గారు మిగతా సభ్యులందరం సోనియాగాంధీ గారిని కలిసి విజ్ఞప్తి చేశాం. ఏది ఏమైనా, మంచి ఫ్యామిలీ బ్యాక్ గ్రౌండ్ ఉన్న మహిళలు రాజకీయాలలోకి రావాలనే ఉద్దేశ్యంతో, ఇందిరాగాంధీ, సోనియా గాంధీ గారి లాంటి అత్యున్నతమైన మహిళలున్న కాంగ్రెస్ పార్టీలోకి మహిళలు చేరాలనే ఉద్దేశ్యంతో మా ఇళ్లకు వచ్చి మా భర్తలను, కుటుంబ సభ్యులను కూడా ఒప్పించి కాంగ్రెస్ పార్టీలో చేర్పించిన ఘనత లక్ష్మీదేవి గారికే దక్కుతుందని సవినయంగా మనవి చేసుకుంటున్నాను. కీర్తిశేషులైన శ్రీమతి లక్ష్మీదేవి గారి ఆత్మకు శాంతి చేకూరాలని, ఇంత చక్కటి నాయకురాలిని కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు మనో ధైర్యాన్ని ప్రసాదించాలనీ కోరుకుంటూ, ముఖ్యమంత్రి గారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానానికి సంపూర్ణ మద్దతు తెలుపుతూ, ఈ అవకాశం కల్పించిన మీకు ధన్యవాదాలు తెలుపుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ పాలడుగు వెంకట్రావు (అసెంబ్లీ) : అధ్యక్షా, ముఖ్యమంత్రి గారు ప్రవేశ పెట్టిన సంతాప తీర్మానంతో ఏకీభవిస్తూ, లక్ష్మీదేవి గారి మరణం నాకు ఒక షాకు లాగా తగిలింది. ఇది ఊహించనటువంటి పరిణామం. లక్ష్మీదేవి గారిని ఎప్పుడు కలిసినా అనారోగ్యంతో ఉన్నా ఇంకా కొన్ని సంవత్సరాల పాటు తిరగగలరు, రాజకీయాలను నడపగలరు అనేటటువంటి భావన ఆమెలో కనపడుతుండేది. ఈ సందర్భంగా ముఖ్యంగా రెండు విషయాలను మనవి చేయాలి. 1972 వ సంవత్సరంలో లక్ష్మీదేవి గారు నాకు పరిచయం అయ్యారు. వెంగళరావు గారు ఆమెను పైకి తీసుకురావడానికి తోడ్పడటం, తన మంత్రివర్గంలోకి తీసుకోవడం జరిగింది. ఒక చక్కటి మంత్రిగా ఈ రాష్ట్రంలో ఆమె పేరు తెచ్చుకోవడం జరిగింది. ముఖ్యంగా, దళిత అనే పదం నేను వాడలేను కాని, భారతదేశ సంస్కృతికి, కుటుంబ వ్యవస్థకు ఒక ప్రతీకగా నేను ఎప్పుడూ ఆమెను చూసే వాడిని.

భార్యా, భర్తలు ఇద్దరు చాలా చక్కగా అన్యోన్యంగా ఎక్కడికి వెళ్లినా కలిసివెళ్ళే వారు. ఆమె భర్త నారాయణప్ప గారు ఏ మీటింగుకు వచ్చినా ఆయన స్థానంలో ఆయన కూర్చొనే వారు. ఈమె స్థానంలో ఈమె కూర్చొనే వారు. ఎప్పుడు కూడా ఆమె భర్త ఒక అంగుళం దాటి ముందుకు వచ్చే వారు కాదు. అలాగే, ప్రజాస్వామ్యానికి కూడా ఆమె ఒక పెద్ద ప్రతీక. భారతదేశానికి వచ్చినటువంటి స్వాతంత్ర్యాన్ని ఉపయోగించుకోవడంలో చిన్న స్థాయి నుండి అంటే గ్రామ స్థాయి నుండి వచ్చి జాతీయ స్థాయిలో ఉన్నటువంటి కాంగ్రెస్ పార్టీలో వర్కింగ్ కమిటీ స్థాయికి ఎదగడానికి ఆమె చేసినటువంటి కార్యక్రమాలు, ఆమె తీసుకున్నటువంటి నిర్ణయాలు, నడచినటువంటి నడకే కారణాలు కాబట్టి వీటిని మనం గుర్తుంచుకోవలసి ఉంది. ముఖ్యంగా పేదరికాన్ని గౌరవించి, పేదరికాన్ని తప్పు అనుకొని డబ్బులు వెంట పడి రాజకీయ విలువలను చంపకుండా బ్రతికినటువంటి వ్యక్తులకు జేజేలు చెప్పాల్సిన అవసరం ఉంది. ఈ రోజులలో అటువంటి విలువలు కావాలని ప్రతి ఒక్కరు కోరుకుంటున్నటువంటి దశలో , ఆమె యొక్క జీవిత విధానం, ఆ కుటుంబ వ్యవస్థ మనందరికి మార్గదర్శకం కావాలి. ప్రజాస్వామ్య విలువలను కాపాడుకున్నటువంటి ఒక మహా నాయకురాలిగా ఆమె ఎదిగారని నేను మనవి చేస్తున్నాను. ఇంతకు మించి, నా వల్ల జరిగిన తప్పును ఈ సందర్భంగా ఒప్పుకోవాలి. ఆమె మంత్రి పదవి పోవడానికి నేనే ఒక కారణం. కమ్మగా సాగుతున్న కాపురంలో ఏవో విభేదాలతో మేమంతా రాజీనామాలు ఇచ్చినందువల్ల ఆమె మంత్రి పదవి పోయినా, విజయభాస్కరరెడ్డి గారి మంత్రి వర్గంలోకి మరల మేము రాలేకపోయినా, తిరిగి ఆమెను మంత్రిగా తీసుకున్నందుకు ఆ రోజునే ఆయనకు ధన్యవాదాలు తెలుపుకున్నాను. ఏదేమైనా, ఈ క్షణంలో అయినా నేను ఆమెకు క్షమాపణలు చెప్పుకోవాలి. ఈ అవకాశం కల్పించిన మీకు ధన్యవాదాలు తెలుపుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

ఉ. 11.00

శ్రీ వై. శివరామిరెడ్డి (అనంతపురం) : అధ్యక్షా, ఈరోజు మన మధ్య లక్ష్మీదేవమ్మగారు లేకపోవడం చాలా బాధాకరమైన విషయం. ఇంత త్వరగా ఆమె మన నుంచి దూరమైనందుకు చాలా బాధగా వుంది. లక్ష్మీదేవమ్మగారు మా జిల్లాలోనే మొట్టమొదటి ఎస్.సి. మహిళా గ్రాడ్యుయేట్. ఆమె మామగారు కూడా 1952 నుంచి 1962 వరకు ఎంఎల్ఏగా పనిచేశారు. ఆమె మంత్రి పదవులు అనుభవించినప్పటికీ ఏ ఒక్క రోజూ గర్వంగా ఫీల్ కాలేదు. సామాన్యమైన కార్యకర్తగా బిహేవ్ చేసేవారు. ఏ రోజైనా ‘‘బాబూ, అహంకారానికి పోవద్దు, మనం ఎంత సాదా సీదాగా ఉంటే ప్రజలు మనల్ని అంత అభిమానిస్తారు’’ అని చెప్పి మమ్ములను కూడా ప్రోత్సహించిన నాయకురాలు. అలాంటి నాయకురాలు చనిపోవడం చాలా బాధాకరమైన విషయం. ఇంతవరకు ఆమె సంపాదించింది ఏమి లేదు కాబట్టి కనీసం మనందరం ఏకగ్రీవ తీర్మానం చేసి ఆమె సీటును వారి కుటుంబానికి ఇచ్చేటట్లు చేస్తే బాగుంటుందని నా కోరిక. ఈ అవకాశం ఇచ్చినందుకు మీ అందరికి నమస్కారాలు తెలియచేస్తున్నాను.

శ్రీ మహమ్మద్ జానీ (అసెంబ్లీ) : అధ్యక్షా, లక్ష్మీదేవి గారు దళిత వర్గాల ప్రజల్లో ఎంతో పేరుగాంచిన నాయకురాలు. సామాన్య కార్యకర్త నుంచి సి.డబ్ల్యుసి. మెంబరుగా ఎదిగి పేదలకు చాలా సేవ చేసిన వ్యక్తి. ఆమెతోబాటు నేను కూడా మంత్రిగా పని చేశాను. ఇది స్వవిషయం. ఆమె లేని లోటు కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు. వీకర్ సెక్షన్స్ ఉద్యమంలో బి.సి.లు, ఎస్.సిలు, ఎస్.టి.లు , మైనారిటీలు అందరు కలసికట్టుగా పోరాడాలని, ఆ అధికారం రావాలని, దానికి ప్రయత్నం చేయాలని ఉత్సాహంగా ఆమె ఎంకరేజ్ చేసేవారు. నేను అనంతపురం జిల్లాకు 2 1/2సంవత్సరాలు ఇన్‌చార్జ్ మంత్రిగా పనిచేశాను. అనంతపురం జిల్లాకు 5 1/2సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీకి ఇన్‌చార్జ్‌గా పనిచేశాను. లక్ష్మీదేవి గారు సిడబ్ల్యుసి మెంబరు కాబట్టి ఒక

టైములో ఎఐసిసి జనరల్ సెక్రటరీ అవుతుందని అనుకున్నాము. కాంగ్రెస్ పార్టీలో సామాన్య కార్యకర్త నుంచి ఆ దశకు చేరాలంటే చాలా కష్టం. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి పాటుపడుతూ ఆమె చేసిన సేవే సిడబ్ల్యుసి మెంబరుగా చేసింది. భగవంతుడు ఆమె ఆత్మకు శాంతి కలుగచేయాలని కోరుతూ నా నివాళి సమర్పిస్తున్నాను.

శ్రీ ఎన్. రఘువీరారెడ్డి (వ్యవసాయశాఖా మంత్రి) : అధ్యక్షా, గౌరవ ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని బలపరుస్తున్నాను. లక్ష్మీదేవమ్మగారి గురించి మంచి మాటలు మాట్లాడుతూ దాదాపు 22 మంది గౌరవ సభ్యులు వాళ్ల బాధను, అదే విధంగా వాళ్ల గౌరవాన్ని కూడా తెలియచేయడం జరిగింది. అనంతపురం జిల్లా వాడిగా, అంతకుమించి కళ్యాణదుర్గ శాసనసభ్యుడిగా నేను వాళ్లందరికి ధన్యవాదాలు తెలియచేస్తున్నాను. పెద్దలు లక్ష్మీదేవమ్మగారు 1936లో జన్మించినారు, 74వ ఏట మొన్ననే వారు దివంగతులు అయ్యారు. 1956లో అనంతపురం ఆర్ట్స్ కాలేజిలో వాళ్లిద్దరూ క్లాస్‌మేట్స్ అని మొన్ననే పెద్దలు నారాయణప్పగారు చెప్పారు. ఆ పరిచయం పెళ్లికి దారితీసిందని కూడా నారాయణప్పగారు మొన్ననే చెప్పడం జరిగింది. అనంతపురం జిల్లాలో లక్ష్మీదేవమ్మగారు మొదటి దళిత గ్రాడ్యుయేటు. శింగనమల దగ్గర కేశాపురం ఆమె సొంత ఊరు. అప్పట్లోనే ఆమె మహిళా దళిత గ్రాడ్యుయేట్. నిజంగా వాళ్ల పేరెంట్సును అభినందించాలి. వాళ్ల మామగారు శాంతప్పగారు కళ్యాణదుర్గంలో రెండుసార్లు శాసన సభ్యుడుగా పనిచేశారు. అంటే నారాయణప్పగారి ఫాదర్. ఆమె అప్పుడు ఉమన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్టుమెంటులో ఎక్స్‌టెన్షన్ ఆఫీర్‌గా పనిచేస్తున్నారు. పెద్దలు పి.వి.చౌదరిగారు సొంత ఊరు, లక్ష్మీదేవమ్మగారిది ప్రక్క ప్రక్క గ్రామాలు. అదే విధంగా ఓబయ్యగారు ఎంఎల్‌సిగా, జిల్లాపరిషత్తు వైస్ చైర్మన్‌గా పనిచేశారు. లక్ష్మీదేవమ్మ బాగా చదువుకున్నారని, అందులో శాంతప్పగారి కోడలని ఆ రోజు రాజకీయల్లోకి తీసుకురావడం జరిగింది. 1972లో ప్రారంభించిన రాజకీయ జీవనం దాదాపు 38, 39 సంవత్సరాలు కొనసాగింది. వారు చివరి క్షణం వరకు పనిచేశారు. పెద్దలు చెప్పినట్లు రెండుసార్లు ఎంఎల్ఏగా, రెండుసార్లు ఎంఎల్‌సిగా, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా, పిసిసి వైస్ ప్రెసిడెంటుగా, సిడబ్ల్యుసి మెంబరుగా, కార్పొరేషన్ చైర్మన్‌గా,, చివర్లో ఎంఎల్‌సిగా ఇంకొక సంవత్సరం ఆమెకు కాలవ్యవధి వుండి క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ వారు చనిపోవడం జరిగింది. యాక్చ్యువల్‌గా ఆమెకు 15 సంవత్సరాల క్రితమే బ్రెస్టు క్యాన్సర్ వచ్చింది. సర్జరీ అయిన తరువాత బాగున్నారు. దురదృష్టవశాత్తు అసెంబ్లీ ఎన్నికలు అయిన నెల లోపలనే మరల క్యాన్సర్ అని డిటెక్ట్ అయింది. పెద్దలు రాజశేఖరరెడ్డిగారు ఏవిధంగా అయినా ఆమెను బ్రతికించుకోవాలి, ఎన్ని లక్షల రూపాయలు ఖర్చు అయినా ఫర్వాలేదని చెప్పి ఆ రోజు నిర్ణయం కూడా తీసుకోవడం జరిగింది. ఇందాక మన తిప్పేస్వామిగారు ఒక మాట చెప్పారు. ఆమె కంటి తడిపెట్టి "నాయనా నన్ను అయితే బ్రతికించినాడు కాని, నేను బ్రతుకుతానని అనుకోలేదు, నన్ను బ్రతికించినాడు కాని ఆ మహానుభావుడు మనకు దొరకకుండా పోయినాడు" అని ఆ బాధలో కూడా ఆమె చెప్పింది అంటే సహాయం చేసిన వాడిని ఎకనాలెడ్జి చేసినటువంటి ఒక మంచి గుణం ఆమెలో కనిపించింది. ఒక దీక్ష, దక్షత కల్గినటువంటి నాయకురాలు. పాటిల్ వేణుగోపాలరెడ్డిగారు ఇక్కడే ఉన్నారు, నన్ను రఘు అని పిలుస్తారు. మడకశిర రిజర్వు అయింది, కాబట్టి నీవు రాయదుర్గం నుంచి పోటీ చేయి, నిన్ను గెలిపించి తీసుకొని వచ్చే బాధ్యత నాది అని చెప్పారు. ఎందుకంటే అతను జిల్లా అంతటా తిరుగుతారు. మేము ఇద్దరం వెళ్లి పెద్దలు రాజశేఖర రెడ్డిగారికి చెప్పివస్తే సరే అన్నారు. ఎందుకు ఇది అయిందో కాని లక్ష్మీదేవమ్మగారు, "నాయనా నన్ను ముఖ్యమంత్రిగారు పిలిపించినారు, పిలిపించి నువ్వు కళ్యాణదుర్గం నుంచి పోటీ చేస్తున్నావు" అని మొట్టమొదట ఆమె నాకు చెప్పింది. అప్పటికి నిజంగా నాకు తెలియదు. మళ్లీ రెండు, మూడు రోజుల తరువాత పిలిపించి, "నీవు కళ్యాణదుర్గంకు పోవాలి, నీవైతే గెలుస్తావు" అని చెప్పి అక్కడకు పంపడం జరిగింది. ఇన్‌ఫర్మేషన్ ఇవ్వడమే కాకుండా ఆమె నాతో నాలుగైదు రోజులు తిరిగింది.

ఉ.11.10

1989వ సంవత్సరం తర్వాత ఆమె అక్కడ గెలవలేకపోవడమో లేకపోతే అక్కడ పోటీ చేయలేకపోవడమో జరిగినా కూడా ఆ గ్రామాలకు వెళ్లితే 60, 70 సంవత్సరాల వయసు కల్గిన వారు ఆమె ఎక్కడికి పోయినా కూడా మా అమ్మ వచ్చింది, అమ్మా నీవు ఇచ్చిన స్కూల్ ఇది, అమ్మా నీవు ఇచ్చిన హాస్టల్ ఇది, అమ్మా ఆ రోజు మా ఊరికి కరెంట్ ఇచ్చావని ఆ గ్రామ ప్రజలు నిజాయితీగా గుర్తు చేసుకుంటున్నారు. ఆమె ఓట్లు అడగడానికి వెళ్లలేదు. నా వెంబడే నన్ను పరిచయం చేయడానికి ఆమె వచ్చింది. ఆమె మీద వారికున్న అభిమానాన్ని చూసి నాకు ఆశ్చర్యం వేసింది. ఆ నియోజక వర్గంలో బాగా కష్టపడి పని చేసిన వారు. ఈ రోజు నేను ఆ నియోజక వర్గంలో పోటీ చేయడం, కేవలం నాలుగు వేల ఓట్ల మెజారిటీతోనే గెలవడం జరిగింది. అది యాంటీ కాంగ్రెస్ కాన్స్టిట్యూయెన్సీ. అయినా కూడా కాంగ్రెస్ పార్టీకి చెందిన పెద్దలందరు ముందుండి నన్ను గెలిపించడం జరిగింది. అనంతపురం జిల్లాలో కళ్యాణదుర్గం నియోజక వర్గం చాలా వెనుకబడినది. ఆ నియోజక వర్గానికి వెళ్లుతున్నప్పుడు నాకు వున్నటువంటి ఆలోచనను ఆమెతో షేర్ చేసుకున్నా ను. అంతకు ముందే నాకు యాక్సిడెంట్ అయింది. ఆమె దగ్గర మాట్లాడుతూ "అమ్మా నియోజక వర్గంలో ఈ విధంగా ఒక ప్రణాళికతో పోదామనుకుంటున్నాను" అని ఆమెతో షేర్ చేసుకుంటే చాలా బాగుంది నాయన అని అన్నారు. అయిదు అంశాలతో ఆమె వద్దకు నేను వెళ్లినప్పుడు ఆమె నన్ను ఆశీర్వదించారు. పెద్దలు లక్ష్మీదేవమ్మ గారు ఇంత పెద్ద హోదా కలిగినా కూడా, పెద్దలు అందరూ ఈ రోజు చెప్పినట్లు ఈ రోజు ఆ పేదరికమనేది నిజంగా అట్లానే వుంది. ఆ భార్యాభర్తలను లక్ష్మీనారాయణులని, పార్వతీ పరమేశ్వరుల్లాగా అన్యోన్యంగా ఉండేవారు. అలా చాలా కొద్ది మందిని మాత్రమే ఈ రోజు చూస్తాము. రాజకీయాలలో వుంటూ కూడా ఆమె నేను మంత్రినంటూ మరొకటి అంటూ ఎప్పుడు కూడా ఆ హోదా చూపించిన వారు కాదు. సరళమైనటువంటి జీవితాన్ని గడిపారు. రేపు 21వ తేది కళ్యాణదుర్గం నియోజక వర్గములో పెద్ద ఎత్తున సంతాప సభ పెట్టడం జరుగుతుంది. వారికి సంబంధించిన విగ్రహాన్ని కూడా అక్కడ పెట్టడం జరుగుతుంది. చాలా మంది సభ్యులు కోరినట్లుగా ఆ కుటుంబానికి ప్రభుత్వ పరంగానూ, పార్టీ పరంగానూ అన్ని విధాలా అండగా వుంటామని ముఖ్యమంత్రి గారు చెప్పారు. నేను కూడా ఆ నియోజక వర్గం వాడిగా, ఆమె ఓటు నాకు వేసింది. ఆ ఓటుతో నేను ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాను. తప్పకుండా ఆమె కుటుంబానికి ప్రభుత్వం తరపున లేక పార్టీ తరపున, వ్యక్తిగతంగా వారిని ఆదుకోవడములో తప్పకుండా బాధ్యత తీసుకుంటానని మనవి చేస్తున్నాను. ఈ సభ పెద్దల సభ పెద్దలు లక్ష్మీదేవమ్మ గారి గురించి సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టడం, అందరూ కూడా బలపరచడం, మీరు మాట్లాడిన తర్వాత ఏకగ్రీవంగా ఈ తీర్మానాన్ని ఆమోదింప చేయడమనేది, తప్పకుండా ఈ ఫీలింగ్స్ అన్నీ కూడా నేను 21వ తేది అక్కడి ప్రజలకు చెబుతాను. అదేవిధంగా ఆ కుటుంబ సభ్యలకు కూడా మీరందరూ ఆమె పట్ల చూపించిన గౌరవ భావాన్ని తప్పకుండా ఆ తాలుకా ప్రజలకు తెలియజేస్తానని చెబుతూ ఆమె ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తున్నాను.

మిస్టర్ ఛైర్మన్ః ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసన పరిషత్తు సభ్యురాలు శ్రీమతి యమ్. లక్ష్మీదేవి గారి మృతి పట్ల ఈ సభ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తుంది. శ్రీమతి యమ్. లక్ష్మీదేవి గారు 1936 సంవత్సరము జులై 1వ తేదిన అనంతపురం జిల్లా, కేశపల్లి గ్రామములో జన్మించారు. వీరు అనంతపురం జిల్లా నుండి 1972 -1978 మరియు 1989-1994 రెండు పర్యాయములు శాసన సభ సభ్యురాలుగా ఎన్నికైనారు. వీరు 1982-1985 మరియు 2007 సంవత్సరాలలో శాసన పరిషత్తు సభ్యురాలుగా ఎన్నికైనారు. వీరు స్త్రీ సంక్షేమ మంత్రిగా మరియు సాంఘిక సంక్షేమ మంత్రిగా సేవలందించారు. వీరికి సాంఘిక సంక్షేమము యందు ప్రత్యేక శ్రద్ద. వీరు తమ నియోజక

వర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. వీరు ఎం.ఎల్.ఏ.,గా, ఎం.ఎల్.సీ.,గా, మంత్రిగా, నిష్పక్షపాతంగా నిరుపేద మహిళ బలహీన వర్గాల ప్రజాసంక్షేమం కోసం నిరంతరం కృషి చేశారు. వీరు 2010 సంవత్సరము ఫిబ్రవరి 11వ తేదీన మరణించారు. వీరి వయస్సు 74 సంవత్సరములు. వీరి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ రెండు నిమిషముల పాటు మౌనం పాటిద్దాము.

(ఈ సందర్భంగా సభ రెండు నిమిషాల పాటు మౌనం పాటించింది.)

MR.CHAIRMAN: The Resolution is unanimously adopted.

Now the House is adjourned to meet again at 10.00 AM on Wednesday, the 17th day of February, 2010.

(The House then adjourned at 11.15 A.M. to meet again at 10.00 AM on Wednesday, the 17th day of February, 2010.)